بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 28.06.2019 (Telugu)**

# ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బద్రి అనుచరులైన హజ్రత్ జైద్ బిన్ హార్స రజియల్లాహు తఆలా అన్‌హు సద్గుణముల ఆసక్తికర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 28.06.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ మోర్డెన్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము**

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

హజ్రత్ జైద్ బిన్ హార్స గురించి మిగిలిన మరికొన్ని సంఘటనలు, విషయములను నేడు నేను ప్రస్తావింతును. సీరత్ ఖాతమున్నబియ్యీన్‌లో హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారిట్లు వ్రాసిరి. హిజ్రి 6వ సం॥ రబీవుల్ ఆఖర్ నెలలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జైద్ బిన్ హార్స నాయకత్వములో కొందరు ముస్లిములను బనూ సులైమ్ తెగ వైపునకు పంపిరి. ఈ తెగ అప్పుడు నజద్ ప్రాంతములో జమూమ్ అనే చోట నివాసముండేది. కొంత కాలము నుండి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు విరుద్ధంగా వీరు కుట్రలు పన్నుచుండిరి. ఈ సమరం నుండి జైద్ బిన్ హార్స తిరిగి వచ్చిన కొద్ది రోజులకే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జమాదియుల్ ఊలా నెలలో వారిని 70 మంది అనుచరులకు నాయకునిగా నియమించి మదీనా నుండి మరల పంపించిరి. చరిత్రకారులు ఈ సమరమునకు కారణము ఇట్లు తెలిపిరి. సీరియా నుండి మక్కా ఖురైష్‌ల ఒక బృందము వచ్చుచుండెను. దానిని నిలువరించుటకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ సైన్యమును పంపిరి. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇక్కడ వివరించవలసిన ముఖ్య విషయమేమనగా ఖురైష్ తెగలు ఎల్లప్పుడు ఆయుధములు ధరించి వుండేవారు. మక్కా నుండి సీరియాకు రాకపోకలు సాగించేటప్పుడు మదీనాకు సమీపము నుండి వెళ్లేవారు. తద్వారా వారి తరపున ప్రతి సారి దాడి జరిగే అవకాశముండేది. ఇంతే కాక ఈ బృందములు మార్గమధ్యలోని తెగలను ముస్లిములకు వ్యతిరేకంగా ప్రేరేపించేవారు. దీని వలన దేశమంతటా ముస్లిములకు విరుద్ధంగా శత్రుత్వ ప్రమాదకర అగ్ని ఎగిసిపడుతుండెను. కావున వారిని నిలువరించవలసిన అవసరముండెను. కావున ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ బృందము గురించి తెలియగానే జైద్ బిన్ హార్సను పంపిరి. వారు అతి తెలివి తేటలతో ఎవరికి తెలియకుండా గుప్తముగా ముందుకు వెళ్లి ఈస్ అనే ప్రాంతములో ఆ బృందమును పట్టుకొనిరి. ఈస్ అనే ప్రాంతము మదీనా నుండి నాలుగు రోజుల ప్రయాణ దూరములో సముద్రము వైపుండెను. ఈ ఆకస్మిక దాడి వలన ఆ బృందము వారు ముస్లిముల దాడిని తట్టుకోలేకపోయిరి. కావున వారు తమ సామాగ్రి అక్కడే వదిలి పారిపోయిరి. జైద్ కొందరు ఖైదీలను బంధించి సామాగ్రిని వశపరచుకొని తిరిగి మదీనాకు చేరుకొని, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద హాజరైరి.

ఇదే విధంగా హిజ్రి 6వ సం॥లో జమాదియుల్ ఆఖర్ నెలలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జైద్ బిన్ హార్స నాయకత్వములో పదిహేను వందల అనుచరుల ఒక బృందమును మఖామ్ వైపునకు పంపిరి. ఇది మదీనా నుండి 36 మైళ్ల దూరాన యుండెను. ఆ కాలములో అక్కడ బనూ సాలబ తెగస్తులు నివాసముండేవారు. కాని జైద్ బిన్ హార్స అక్కడికి చేరుకునే లోపు వారికి ఈ సమాచారము తగిన సమయములో అందినందున వారు అక్కడి నుండి పారిపోయిరి.

హిజ్రి 6వ సం॥లో జమాదియుల్ ఆఖర్ నెలలో జైద్ బిన్ హార్స నాయకత్వములో ఒక సైన్యము హిస్మి ప్రాంతమునకు పంపబడెను. జైద్ బిన్ హార్సను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం 500 ముస్లిములతో హిస్మి ప్రాంతమునకు పంపిరి. ఇది మదీనాకు ఉత్తరాన బనూ జుజామ్ నివాసముగా యుండెను. ఈ సమరమునకు ఉద్దేశమేమనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక అనుచరులు దహ్‌యా కల్బీ ఖైసరె రోమ్‌తో భేటి అయిన తర్వాత సీరియా నుండి తిరిగి వచ్చుచుండిరి. వారు బనూ జుజామ్ ప్రాంతము నుండి వెళ్లుచుండగా ఆ తెగ నాయకుడు హునేద్ బిన్ ఆరిజ్ తమ తెగలోని కొందరు వ్యక్తులను తీసుకొని దహ్‌యాపై దాడి చేసి ఖైసర్

ఇచ్చిన సామాగ్రి, వ్యాపార వస్తువులన్నిటిని దోచుకొనెను. దహ్యా మదీనా చేరుకొని ఈ పరిస్థితులన్నిటిని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలియజేసెను. ఇందుకు బదులుగా జైద్ బిన్ హార్సను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పంపిరి. జైద్ వెంట దహ్యాను సైతం పంపిరి. జైద్ బృందము అతి చాకచక్యంగా అన్ని జాగ్రత్తలు పాటించుచు పగలు గుప్తముగా యుండి రాత్రి ప్రయాణము చేస్తూ హిస్మి ప్రాంతమునకు చేరుకొని ఉదయాన్నే బనూ జుజామ్ ప్రజల వద్దకు చేరుకొనిరి. బనూ జుజామ్ ఎదురు దాడికి దిగిరి. యుద్ధ తరహాలో పోరాటం జరిగినది. కాని ముస్లిముల ఆకస్మిక దాడిని వారు ఎదుర్కోలేక కొద్ది సమయములోనే అక్కడి నుండి పారిపోయిరి. ముస్లిములకు విజయము లభించెను. జైద్ బిన్ హార్స చాలా సామాగ్రి, పశువులు, సుమారు వంద మందిని ఖైదీలుగా బంధించి తీసుకొని తిరిగి వచ్చిరి. హిస్మి సమరము నెల తర్వాత ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరల జైద్ బిన్ హార్సను వాదియుల్ ఖురా వైపునకు పంపిరి. ఈ యుద్ధములో చాలా మంది ముస్లిములు అమరులైరి. స్వయముగా జైద్‌నకు కూడ చాలా గాయాలైనవి. కాని అల్లాహ్ తఆలా కృపానుసారము సురక్షితంగా తిరిగి వచ్చిరి.

హిజ్రి 8వ సం॥లోని జమాదియుల్ అవ్వల్ నెలలో మౌతా యుద్ధము సంభవించినది. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇట్లు ఉల్లేఖించిరి. మౌతా యుద్ధమునకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జైద్ బిన్ హార్సను నాయకునిగా నియమించిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. జైద్ అమరులైనచో జాఫర్ అమీర్‌గా యుందురు. జాఫర్ కూడ అమరులైనచో అబ్దుల్లాహ్ బిన్ రవాహ మీకు నాయకులగుదురు. ఒక యూదుడు ఈ విషయములను విని హజ్రత్ జైద్ వద్దకు వచ్చి వారికిట్లు చెప్పెను. ఈ మీ ప్రవక్త నిజమైన ప్రవక్త అయినచో మీలోని ఎవరు బ్రతికి తిరిగి రాలేరు. హజ్రత్ జైద్ అతనితో ఇట్లనిరి. నేను బ్రతికి వస్తానా రానా అనేది ముఖ్యము కాదు. కాని మా ఈ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిశ్చయముగా నిజమైన ప్రవక్తయే. అల్లాహ్ తఆలా అభీష్టము మేరకు ఈ సంఘటన పూర్తిగా అలాగే జరిగెను. హజ్రత్ జైద్ అమరులైరి. వారి తర్వాత జాఫర్ నాయకత్వము అందుకొనిరి. వారు కూడ అమరులైరి. ఆ రత్వాత హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహ సైన్యాధిపతిగా మారిరి. కాని వారు కూడ అమరులైరి. సైన్యము విచ్ఛిన్నం కాక ముందే ముస్లిములు సూచించగా హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ పతాకమును తమ చేతిలో పట్టుకొనిరి. వారి ద్వారా అల్లాహ్ తఆలా ముస్లిములకు విజయము నొసంగెను. ఆ తర్వాత వారు సురక్షితంగా తిరిగి వచ్చిరి.

హజ్రత్ జైద్ బిన్ హార్స, హజ్రత్ జాఫర్, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహ అమరులైన విషయము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలియగా వారి స్థితిని వివరించుటకు నిలబడిరి. మొదట హజ్రత్ జైద్ ప్రస్తావన ప్రారంభించిరి. వారిట్లనిరి. ఓ అల్లాహ్! జైద్‌ను క్షమించు. ఓ అల్లాహ్! జైద్‌ను క్షమించు. ఓ అల్లాహ్! జైద్‌ను క్షమించు. అనంతరం వారిట్లనిరి. ఓ అల్లాహ్! జాఫర్, అబ్దుల్లాహ్ బిన్ రవాహను క్షమించు. తబ్ఖాతుల్ కుబ్రాలో ఇట్లు వ్రాసి యున్నది. హజ్రత్ జైద్ అమరులైనప్పుడు వారి కుటుంబ సభ్యులను ఓదార్చుటకు నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వెళ్లిరి. వారి కుమార్తె ముఖము నుండి దుఃఖము వ్యక్తమగుచుండెను. అప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం కన్నీరు పెట్టుకొనిరి. అమరులైనప్పుడు వారి వయసు 55 సంవత్సరములుండెను. హజ్రత్ జైద్ అంత్యక్రియ ప్రార్థన రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చదివించిరి. అనతరం ఇట్లనిరి. హజ్రత్ జైద్ కొరకు క్షమాపణ యాచించండి. వారు పరుగెత్తుకుంటూ స్వర్గములో ప్రవేశించిరి.

హజ్రత్ జబల ఇట్లు ఉల్లేఖించిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏదేని యుద్ధమునకు వెళ్లకుండా వున్నప్పుడు తమ ఖడ్గము హజ్రత్ అలీ, హజ్రత్ జైద్ తప్ప మరెవరికి ఇచ్చేవారు కాదు. హజ్రత్ జబల మరో కథనము ఇట్లు ఉల్లేఖించిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు రెండు అంబారీలు (కుజావా)లు కానుకగా వచ్చెను. వాటిలోని ఒక దానిని వారు సల్లల్లాహు అలైహి వసల్లం వుంచుకొని రెండవది హజ్రత్ జైద్‌కు ఇచ్చిరి. మరల హజ్రత్ జబల గారే ఇట్లు ఉల్లేఖించిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు రెండు చొక్కాలు కానుకగా వచ్చెను. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఒక దానిని తమ వద్ద వుంచుకొని రెండవది హజ్రత్ జైద్‌కు ప్రసాదించిరి. హజ్రత్ జైద్ బిన్ హార్సను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రియునిగా పిలిచేవారు. హజ్రత్ జైద్ గురించి నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా కరుణించిన వ్యక్తి జైద్ నాకు ప్రజలలో అందరికంటే ఎక్కువ ఇష్టమున్నవాడు.

హిజ్రి 11వ సం॥ సిఫర్ నెలలో మౌతా యుద్ధమునకు ప్రతీకారము తీర్చుకొనుటకు ఆంహజ్రత్ సల్లల్లాహు

అలైహి వసల్లం ఒక పెద్ద సైన్యమును సిద్ధము చేసిరి. రోమ్‌నకు వ్యతిరేకంగా యుద్ధము చేయుటకు సిద్ధము కావలెనని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. ఈ సైన్యము సిద్ధమైనప్పుడు మరుసటి రోజు వారు సల్లల్లాహు అలైహి వసల్లం హ(జ్రత్ ఉసామా బిన్ జైద్‌ను పిలిపించి ఈ యుద్ధమునకు సైన్యాధికారిగా నియమించిరి. నీ తండ్రి అమరుడైన ప్రదేశానికి వెళ్లుము, అతి వేగంగా ప్రయాణించుము. వారికి తెలియక ముందే అక్కడికి చేరుకో. ఉదయాన్నే వారిపై దాడి చేయుము. హ(జ్రత్ జైద్ ప్రతీకారము తీర్చుకొనుటకు ఆయా ప్రాంతాన్ని తమ అశ్వముల పాదాలతో తొక్కివేయుము. ఉసామాతో ఆంహ(జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇంకా ఇట్లనిరి. దారి చూపువారిని కూడ తమ వెంట తీసుకెళ్లుము. అక్కడి సమాచారము తెలుసుకొనుటకు కూడ కొందరిని నియమించుము. తద్వారా వారు అక్కడి పరిస్థితులను మీకు తెలుపుదురు. అల్లాహ్ తఆలా మీకు విజయము నొసంగుగాక!. త్వరగా తిరిగి రా!. అప్పుడు హ(జ్రత్ ఉసామా వయసు 17-20 సం॥లు యుండెను. హ(జ్రత్ ఉసామా కొరకు ఆంహ(జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వహస్తాలతో ఒక పతాకము సిద్ధము చేసిరి. అల్లాహ్ నామముతో అతని మార్గములో జిహాద్ చేయుము. అల్లాహ్‌ను నిరాకరించిన వారితో యుద్ధము చేయుము.

రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆరోగ్యము మరింత క్షీణించెను. అయినను ఉసామా సైన్యమును పంపవలెనని వారు ఆదేశించేవారు. సోమవారము రోజున ఆరోగ్యము కొంత మేరకు మెరుగుపడగా అల్లాహ్ తఆలా శుభముతో బయలు దేరమని వారు సల్లల్లాహు అలైహి వసల్లం హ(జ్రత్ ఉసామాను ఆదేశించిరి. ఇంతలోనే ఆంహ(జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చివరి క్షణాలుగా అనిపించుచున్నది. వారి ఆరోగ్యము చాలా క్షీణించినదని వారి తల్లి హ(జ్రత్ ఉమ్మె ఐమన్ ద్వారా సమాచాము అందినది. ఈ బాధాకరమైన వార్త వినగానే హ(జ్రత్ ఉసామా, హ(జ్రత్ ఉమర్, హ(జ్రత్ అబూ ఉబైదహ్ తక్షణమే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, చూడగా వారు కొణ ఊపిరితో వుండిరి. 12 రబీవుల్ అవ్వల్ తేదీన వారు సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిరి. కావున ముస్లిముల సైన్యము జుర్ఫ్ ప్రాంతము నుండి తిరిగి మదీనాకు చేరుకొనెను. హ(జ్రత్ ఉసామా పతాకమును రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తలుపునకు హ(జ్రత్ బరీదహ్ కట్టివేసిరి. హ(జ్రత్ అబూబకర్ ఖలీఫాగా ఎన్నికైన తర్వాత హ(జ్రత్ ఉసామా తమ లక్ష్యమును నెరవేర్చుటకు బయలు దేరాలని పతాకము తీసుకొని వారి ఇంటికి వెళ్ళాలని హ(జ్రత్ అబూబకర్ హ(జ్రత్ బరీదహ్‌ను ఆదేశించిరి. హ(జ్రత్ బరీదహ్ పతాకము తీసుకొని సైన్యపు మొదటి ప్రాంతానికి చేరుకొనిరి. ఆంహ(జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అస్తమించిని తర్వాత అరబ్ దేశమంతటా ప్రజలు ధర్మభ్రష్టులగుచుండిరి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు ఉసామా సైన్యమును వాయిదా వేయుట మంచిదని అనుచరులు హ(జ్రత్ అబూబకర్‌నకు సలహాలిచ్చిరి. కాని హ(జ్రత్ అబూబకర్ ఒప్పుకొనక ఇట్లనిరి. జంతువులు నన్ను పీక్కుతిన్నను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సిద్ధము చేసిన ఈ సైన్యమును ఆపను. దీనిని నేను తప్పక పంపింతును. కావున సైన్యము మరొక్కసారి సిద్ధమైనది. ప్రమాదకరమైన పరిస్థితుల వలన ఈ సైన్యమును ప్రస్థుతం నిలిపివేయుట మంచిదని అనుచరులు మరోసారి అభి(ప్రాయమిచ్చిరి. ఒక కథనము ప్రకారము కొందరు అన్సార్ అనుచరులు హ(జ్రత్ ఉమర్‌తో ఇట్లనిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖలీఫా అయిన హ(జ్రత్ అబూబకర్ సైన్యమును పంపుటకే నిర్ణయించుకొన్నచో ఈ సైన్యాధికారిని మార్చి హ(జ్రత్ ఉసామా కంటే పెద్ద వయస్కుడైన వ్యక్తిని నియమించాలని మనవి చేయండి. ప్రజల ఈ అభి(ప్రాయముతో హ(జ్రత్ అబూకర్ వద్దకు హ(జ్రత్ ఉమర్ చేరుకొని తెలుపగా హ(జ్రత్ అబూబకర్ గట్టి నమ్మకముతో ఇట్లనిరి. అరణ్య జంతువులు మదీనాలో ప్రవేశించి నన్ను అపహరించినను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిన పనిని నేను నిలిపివేయను. హ(జ్రత్ అబూబకర్ దృఢమైన నిర్ణయమును విని హ(జ్రత్ ఉమర్ తిరిగి సైన్యము వద్దకు చేరుకొనిరి. ఏమైనదని ప్రజలు ప్రశ్నించగా నా దగ్గరికి ఎవరు రాకూడదని హ(జ్రత్ ఉమర్ చాలా కోపముతో అనిరి. మీ వల్లనే నేడు నన్ను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖలీఫా కోపగించుకొనిరి. హ(జ్రత్ అబూబకర్ ఆదేశము మేరకు జుర్ఫ్ ప్రాంతములో సైన్యము మరల గుమికూడెను. హ(జ్రత్ అబూబకర్ స్వయంగా అక్కడికి వెళ్లి సైన్యమును పరిశీలించి, తీర్చి దిద్దిరి. అప్పుడు హ(జ్రత్ ఉసామా స్వారి అయివుండగా హ(జ్రత్ అబూబకర్ ఖలీఫతుర్రసూల్ నడుచుచుండిరి. ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖలీఫా! మీరైనా ఎక్కండి లేక నేనైనా క్రిందికి దిగుతాను అని హ(జ్రత్ ఉసామా వేడుకొనిరి. హ(జ్రత్ అబూబకర్ ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణము! నువ్వు క్రిందికి దిగకు, నేను పైకి ఎక్కను. దైవ మార్గములో ఒక ఘుడియ కొరకైనా నేను నడవకూడదా? ఎందుకనగా వీరుడు నడిచినప్పుడు ఒక అడుగుకు బదులు ఏడు వందల పుణ్యములు అతని కొరకు వ్రాయబడును. ఏడు వందల రెట్లు అతని స్థాయి అంతస్థులను పెంచును. అతని ఏడు వందల పాపములను క్షమించును.

ఈ సంఘటన తర్వాత హజ్రత్ ఉసామాను హజ్రత్ ఉమర్ కలిసినప్పుడల్లా వారినుద్దేశించి **'అస్సలాము అలైక అయ్యుహల్ అమీర్'** అనగా ఓ నాయకుడా! నిన్ను అల్లాహ్ కరుణించుగాక! అని పలకరించేవారు. బదులుగా హజ్రత్ ఉసామా ఇట్లనేవారు. **'ఘఫరల్లాహు లక యా అమీరల్ మొమినీన్'** అనగా ఓ విశ్వాసుల నాయకుడా! అల్లాహ్ తఆలా మిమ్ములను క్షమించుగాక!

హజ్రత్ ఉసామా సైన్యమునుద్దేశించి హజ్రత్ అబూబకర్ ఇట్లు ఉపదేశించిరి. మీరు అవినీతికి పాల్పడకూడదు. వాగ్దాన భంగము చేయరాదు. మృతి చెందిన శత్రువు శవమును అవమానపర్చకూడదు. చిన్న పిల్లలు, వృద్ధులు, స్త్రీలను హతమార్చకూడదు. ఖర్జూర వృక్షములను నిరిక వేయరాదు, దహనం చేయకూడదు. గొర్రె, ఆవు, ఒంటెను భుజించడానికి తప్ప వధించరాదు. మరల వారిట్లనిరి. తమను తాము ప్రార్థన కొరకు చర్చిలలో తమను తాము సమర్పించిన వారితో తప్పక మీరు తారసపడుదురు. అటువంటి వారిని విడిచిపెట్టవలెను. తమ పాత్రలలో విభిన్న రకాల ఆహారము తీసుకొని వచ్చి మీకు ఇచ్చేవారు కూడ తప్పక మీకు కలుస్తారు. వాటిని మీరు భుజించినప్పుడు బిస్మిల్లాహ్ చదువుము. తమ తల నీలాలు తీయించుకొని నాలుగు వైపుల నుండి తాళ్ల వలె తమ కేశములను పెంచుకున్న వారితో మీరు తప్పక కలుస్తారు. ఇటువంటి వారిని మీరు ఖడ్గముతో కొద్దిగా గాయపరచి అల్లాహ్ నామముతో తమను తాము రక్షించుకొనుము. అల్లాహ్ తఆలా మిమ్ములను శాపము, మహమ్మారి రోగము నుండి రక్షించుగాక! 11వ హిజ్రి సం॥లో రబీవుల్ ఆఖర్ మొదటి రోజున హజ్రత్ ఉసామా తమ సైన్యమును తీసుకొని మదీనా నుండి బయలు దేరిరి. ఒక్కొక్క ప్రాంతమును దాటుచు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచనల మేరకు సీరియాలోని అబ్నా ప్రాంతమునకు చేరుకొనిరి. ఉదయం నగర నాలుగు వైపుల నుండి వారిపై దాడికి దిగిరి.

ఈ యుద్ధములో ముస్లిములను ఎదురించిన ప్రతి వ్యక్తి హతమయ్యెను. చాలా మంది ఖైదీలుగా బంధించబడిరి. ఇదే విధంగా అధిక మోతాదులో యుద్ధ సామాగ్రి కూడ లభించెను. దానిలోని 5వ భాగము వుంచుకొని మిగతా మొత్తం సైన్యములో పంచిపెట్టిరి. ఈ యుద్ధము ముగించుకొని సైన్యము అక్కడే ఒక రోజు బస చేసిన తర్వాత మరుసటి రోజు మదీనా కొరకు బయలు దేరెను.

ఈ సైన్యము విజయము, సఫలముతో మదీనాకు తిరిగి వచ్చినప్పుడు ముహాజిర్లు, అన్సార్ మదీనా శివారుకు వచ్చి వారికి ఆడంబరంగా స్వాగతం పలికిరి. సైన్యము మదీనాలో ప్రవేశించి మస్జిద్ నబ్వీ వరకు చేరుకొనెను. హజ్రత్ ఉసామా మస్జిద్‌లో రెండు రకాతులు నఫిల్ చదివిన తర్వాత తమ ఇంటికి వెళ్లిపోయిరి. ఉసామా సైన్యమును పంపినందుకు ముస్లిములకు చాలా ప్రయోజనము కలిగినది. ఎందుకనగా ముస్లిములకు శక్తి యుక్తులు లేనిచో వారు ఎట్టి పరిస్థితిలోను ఈ సైన్యమును పంపేవారు కాదని అరబ్బులు మాట్లాడుకోసాగిరి. ఈ విధంగా ముస్లిములకు వ్యతిరేకంగా చేయదలచిన కుట్రల నుండి అవిశ్వాసులు దూరముండిరి. మన నాయకుడు, ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్‌నకు ప్రియులైన, ఆప్తులైన హజ్రత్ జైద్ బిన్ హార్స, వారి కుమారుడు హజ్రత్ ఉసామా బిన్ జైద్‌పై అల్లాహ్ తఆలా వేలాది కరుణలు, శుభములను కురిపించుగాక!

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ గౌ॥ సిద్దీఖ్ ఆదమ్ గారు ఆఫ్ ఐవరి కోస్ట్, గౌ॥ గులాం ముస్తఫా గారు ఆఫ్ ఓకాఢ పాకిస్తాన్ గారి సద్గుణములను ప్రస్తావించి వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించిరి.

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

..............................................................

..............................................................

..............................................................